బీఆర్ఎస్ పార్టీ ప్రజా సంక్షేమానికి కృషి

ఎంబీసీ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్

బీఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలసిన ఎంబీసీ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్

మల్కాజిగిరి, ఆగస్టు 24: బీఆర్ఎస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ఎంబీసీ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఎంబీసీ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్ శనివారం కలిశారు. ఈ సందర్భంగా ఎంబీసీ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి కేసీఆర్ సంక్షేమ పథకాలను అమలు చేశారని అన్నారు. దళిత కుటుంబాలు ఆర్థికంగా ఎదగడంతో పాటు మరి కొంత మందికి ఉపాధి కల్పించడానికి దళిత బంధు పథకంలో ఒక్కొక్కరికి రూ.10 లక్షల స్వయం ఉపాధి యూనిట్లను మంజూరు చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుపరచడంలో విఫలమైందని అన్నారు.

నాబార్డ్ చైర్మన్ షాజీ కేవీకి సన్మానం..

ముంబైలోని నాబార్డ్ (నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చరల్ అండ్ రూరల్ డెవలప్ మెంట్) ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర సహకార బ్యాంకుల జాతీయ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన నాబార్డ్ చైర్మన్ షాజీ కేవీని తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు శనివారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానం చేశారు. కార్యక్రమంలో టెస్కాడ్ డైరెక్టర్లు కొండూరు రవీందర్ రావు, చిట్టి దేవేందర్ రెడ్డి, భోజారెడ్డి, కుంభం శ్రీనివాస్ రెడ్డి, టెస్కాబ్ సీజీఎం జ్యోతి, మెదక్ డీసీసీబీ సీఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

– సుల్తాన్ బజార్, ఆగస్టు 24;

విద్యుత్ నెట్‌వర్క్‌లో మూగ జీవులకు రక్షణ

- మార్పులు చేసిన విద్యుత్ శాఖ
- హెచ్‌జీ ఫ్యూజ్‌ల వద్ద మెటల్ క్లాంపుల ఏర్పాటు



విద్యుత్ నెట్ వర్క్‌లో హెచ్‌జీ ఫ్యూజ్‌ల వద్ద ఏర్పాటు చేసిన మెటల్ క్లాంపులు

సిటీబ్యూరో, ఆగస్టు 24(నమస్తే తెలంగాణ): విద్యుత్ నెట్‌వర్క్‌లో తరచుగా అంతరాయాలపై దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇటీవల కాలంలో విద్యుత్ తీగలు, పవర్ కండక్టర్లు, హెచ్‌జీ ఫ్యూజ్‌ల వద్ద మూగ జీవాలైన బల్లి, పిల్లి, పావురాలు, ఉడత, ఉడుము వంటివి మృత్యువాత పడ్డాయి. అదే సమయంలో దాని ప్రభావంతో ఆ ప్రాంతమంతా విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. ఏకంగా 11 కేవీ ఫీడర్లు పలు చోట్ల ట్రిప్ కావడంతో విద్యుత్ సరఫరాకు ఒక్కసారిగా అంతరాయం కలుగుతోంది. మూగ జీవాలు విద్యుత్ నెట్ వర్క్‌లలోకి రావడం వల్ల ఫీడర్ల ట్రిప్పింగ్‌లు 14 శాతం అవుతున్నాయని గుర్తించారు. ఈ నేపథ్యంలో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ తరచుగా తలెత్తుతున్న సమస్యలకు పరిష్కారానికి పలు మార్పులు సూచించారు.

మెటల్ క్లాంపుల ఏర్పాటు..

విద్యుత్ నెట్‌వర్క్‌లో ఉపయోగించే పరికరాల్లో ప్రస్తుతం, హర్న్ గ్యాప్ ఫ్యూజ్ (హెచ్‌జీ ఫ్యూజ్) వద్ద మెటల్ క్లాంపులు వినియోగిస్తున్నారు. వీటి స్థానంలో ప్రత్యేకంగా రూపొందించిన ఫైబర్ రీన్‌ఫోర్స్‌డ్ పాలిమర్(ఎఫ్ఆర్‌బీ) సిలికాన్ క్లాంపులను ఏర్పాటు చేస్తున్నామని సీఎండీ ముషారఫ్ తెలిపారు. ఈ సిలికాన్ క్లాంపు విద్యుత్ వాహకంగా పనిచేయవు. కాబట్టి మూగ జీవాలు వాటి మీదుగా పాకినా, నడిచినా ఎలాంటి ప్రమాదం ఉండదని తెలిపారు. ముందుగా చెట్లు అధికంగా ఉండి, ఇలాంటి మూగ జీవులు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో దాదాపు 3000 ఎఫ్ఆర్‌బీ సిలికాన్ క్లాంపులను ఫ్యూజ్, బ్రేకర్స్, లింబ్స్ వంటి చోట ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఈ మార్పుతో మూగ జీవాలకు ప్రాణ హానీ లేకుండా ఉండటంతో పాటు విద్యుత్ అంతరాయాలను కట్టడి చేసే అవకాశం ఉందని సీఎండీ ముషారఫ్ ఫరూఖీ పేర్కొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగి కుటుంబానికి కోటి ఇన్సూరెన్స్

అందించిన యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా

సిటీబ్యూరో, ఆగస్టు 24(నమస్తే తెలంగాణ): ప్రమాదంలో మృతి చెందిన టీజీఎస్ ఆర్‌టీసీ ఉద్యోగి కుటుంబానికి కోటి రూపాయల బీమా మొత్తాన్ని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా శనివారం చెల్లించింది. యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో కార్పొరేట్ సాలరీ అకౌంట్‌ను టీజీఎస్ఆర్టీసీ సంస్థ కలిగి ఉంది. దీని వల్ల అకౌంటుదారునికి వ్యక్తిగత ప్రమాద బీమా పథకాన్ని అమలు చేయడం వల్ల కోటి రూపాయలు పొందే అవకాశం దక్కింది. నగరంలోని ఆర్టీసీ కళ్యాణ మండపంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ప్రమాదవశాత్తు మృతి చెందిన ఆర్టీసీ ఉద్యోగి కుటుంబానికి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ఆర్టీసీ వీసీ, ఎండీ వీసీ సజ్జనార్‌లు ప్రమాద బీమా మొత్తాన్ని అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా డిప్యూటీ జోనల్ హెడ్ ఎం.అరుణ్ కుమార్, రీజినల్ హెడ్ సత్యం పాల్గుణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌లు, సీఎఫ్ఓ, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

వ్యాయామం, యోగాతో మెరుగైన ఆరోగ్యం

- మారథాన్ 2024 రేస్ డైరెక్టర్ రాజేష్ వెచ్చా
- హైటెక్స్ గ్రౌండ్‌లో ఉత్సాహంగా సాగిన 5కే రన్

5కే రన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న హైదరాబాద్ మారథాన్ 2024 రేస్ డైరెక్టర్ రాజేష్ వెచ్చా

మాదాపూర్, ఆగస్టు 24: హైదరాబాద్ రన్నర్స్ సొసైటీ చురుకైన జీవన శైలి ఉద్యమానికి నాయకత్వం వహించడం గొప్ప విషయమని ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్ 2024 రేస్ డైరెక్టర్ రాజేశ్ వెచ్చా అన్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్ గ్రౌండ్‌లో ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ఆధ్వర్యంలో తలసేమియా వ్యాధిగ్రస్తులకు మద్దతునిచ్చే దిశగా అడుగులు వేస్తూ శనివారం 14 ఎన్‌జీఓలతో కలిసి ఎన్ఎండీసీ హైదరాబాద్ 5కే రన్ 13వ ఎడిషన్‌ను అట్టహాసంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్ 2024 రేస్ డైరెక్టర్ రాజేశ్ వెచ్చా విచ్చేసి ఎన్ఎండీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జైపాల్‌రెడ్డి, ఐబీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ హెడ్ బ్రాంచ్ బ్యాంకింగ్ సౌత్ నిరీశ్ లలాన్‌లతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచ అథ్లెటిక్ బేసిక్ లేబుల్‌తో దీనిని అంతర్జాతీయ రన్నింగ్ క్యాలెండర్‌లో ఉంచినట్లు తెలిపారు. అంతర్జాతీయ ఎలైట్ అథ్లెట్ల భాగస్వామ్యంతో సహా రాష్ట్రాలు, యూటీలు ప్రపంచ అథ్లెటిక్స్ లేబుల్ రేసులో ప్రపంచ స్థాయి సౌకర్యాలను అందించేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలిపారు. ఆరోగ్యకరమైన జీవన విధానానికి సమతుల్యమైన ఆహారంతో పాటు వ్యాయామం, యోగా వంటివి దినచర్యలో భాగం కావాలన్నారు. చురుకైన జీవన విధానానికి మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. ప్రజలు చురుకైన జీవనశైలిని నడిపించడంలో సహాయపడటం, రన్నింగ్, ఫిట్‌నెస్ యాక్టివిటీకి ప్రాధాన్యతనిచ్చేలా చేయడం వంటి ఆలోచనతో స్థాపించబడినట్లు ఆయన తెలిపారు. 5కే రన్‌లో భాగంగా ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్ 2024 రేస్ డైరెక్టర్ రాజేశ్ వెచ్చా నిర్వాహకులతో కలిసి జెండా ఊపి ప్రారంభించగా చిన్న, పెద్దలు అనే తేడాలు లేకుండా ఉత్సాహంగా పరుగులో పాల్గొన్నారు. ఇందులో దాదాపు ఎనిమిది వేలకు పైగా నగర వాసులు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఇదిలా ఉండగా, ఆదివారం ఉదయం 4:30 గంటలు, 5:30 గంటలు పీపుల్స్ ప్లాజా, నెక్లెస్ రోడ్డులో ఫ్లాగ్ ఆఫ్ చేయనున్నట్లు తెలిపారు.

క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

తెలంగాణ ప్రభుత్వ ఢిల్లీ అధికార ప్రతినిధి జితేందర్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ ఢిల్లీ అధికార ప్రతినిధి జితేందర్ రెడ్డి

రవీంద్రభారతి, ఆగస్టు 24: తెలంగాణ ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి కృషి చేస్తుందని తెలంగాణ ప్రభుత్వ ఢిల్లీ అధికార ప్రతినిధి జితేందర్‌రెడ్డి అన్నారు. క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఇన్ తెలంగాణ (సీఏబీటీ) ఆధ్వర్యాన సమావేశాన్ని రవీంద్రభారతి సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జితేందర్‌రెడ్డి, ప్రముఖ హాస్యనటుడు, సాహితీవేత్త తనికెళ్ల భరణి, స్టార్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వీరయ్యలు విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి దాదాపు 40 వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన అంధ క్రీడాకారులకు మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ, అంధులు కళ్ళు లేకున్నా గాని వారి మేధస్సు చాలా గొప్పదని, అంధుల్లో తెలివితేటలు అధికంగా ఉంటాయని, కళ్లు లేకున్నా సమాజానికి ఎంతో ఉపయోగపడుతున్నారని ఆయన తెలిపారు. అంధులై ఉండి కూడా క్రీడల్లో రాణించడం సామాన్యమైన విషయం కాదన్నారు. జాతీయ స్థాయిలో అంధ క్రికెట్ విభాగంలో ప్రతిభ కనభరిచిన వి.మాధవులు, మధులకు అవార్డులు అందజేసి సన్మానం చేశారు. సీఏబీటీ అధ్యక్షుడు డా.హరీశ్ కుమార్, కార్యదర్శి శ్రీధర్, దైవజ్ఞ శర్మ, అంజిరెడ్డి పాల్గొన్నారు.

కబ్జాలపై చర్యలు తీసుకోండి

- చెరువులు అన్యాక్రాంతం కాకుండా చూడండి
- బాలాపూర్ మండలంలో కబ్జాలపై హైడ్రాలో ఫిర్యాదుల వెల్లువ

బడంగ్‌పేట, ఆగస్టు 24: బాలాపూర్ మండల పరిధిలో జరుగుతున్న భూ కబ్జాలపై నేతలు రోజూ ఫిర్యాదు చేస్తున్నారు. బాలాపూర్ మండల పరిధిలోని మీర్‌పేట, బడంగ్‌పేట, జిల్లెలగూడ, మల్లాపూర్, వెంకటాపూర్, నాదర్‌గుల్, అల్మాస్‌గూడ ఉన్న చెరువులు, ప్రభుత్వ భూముల కబ్జాలపై చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్లు లీలా రవినాయక్, ఇంద్రావత్ రవి నాయక్, సౌందర్య విజయ్ కుమార్ బీజేపీ నాయకులు చవ్వ శ్రావణ్ కుమార్, గడ్డం వెంకటేష్, సూరకర్ణ రెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకుడు బొర్ర రవి కుమార్లు వేర్వేరుగా హైడ్రాలో ఫిర్యాదులు చేశారు. కొన్ని నెలల నుంచి జిల్లా కలెక్టర్‌కు, ఆర్డీవోలకు, తహసీల్దార్‌కు, హెచ్ఎండీఏ అధికారులకు, సీడీఎంఏ అధికారులకు, మున్సిపల్ కమిషనర్లకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఎవ్వరు పట్టించుకోక పోవడంతో హైడ్రాను ఆశ్రాయించామని ఫిర్యాదుదారులు పేర్కొంటున్నారు. మీర్‌పేటలో ఉన్న పెద్ద చెరువు 70 ఎకరాల ఉండగా, ప్రస్తుతం, ఆ చెరువు కుచించుక పోయిందన్నారు. లెనిన్ నగర్ సర్వే నంబర్ 119,119/1,119/2.119/3లో ఉన్న ఏడెకరాల ప్రభుత్వ భూమి కబ్జా అయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కొంత మంది తప్పుడు ఇంటి నంబర్లు తీసుకొని జీవో 59, 58లో క్రమబద్ధీకరణ చేసుకున్నారన్నారు. ఎలాంటి ఆధారులు లేకుండా విద్యుత్ మీటర్లు ఇవ్వడం జరిగిందన్నారు. మీర్‌పేటలో ఉన్న చందన చెరువు, మంత్రాల చెరువు, పెద్ద చెరువు మూడు చెరువులు కబ్జా అయినట్లు తెలిపారు. జిల్లెలగూడ సర్వే నం. 120, 121, 122, 123లో ఉన్న ప్రభుత్వ భూమి కబ్జా చేయడం జరిగిందన్నారు. సర్వే నం. 132, 133, 137, 138 చంద్ర కాలనీ ఆర్‌సీఐ ప్రధాన రోడ్డుపై ఉన్న ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం అయినట్లు వివరించారు. అల్మాస్‌గూడలోని కోమటి కుంట, పోచమ్మ కుంట, ఎర్ర కుంటతో పాటు కబ్జా అయిన ప్రభుత్వ భూములను, పార్కులను కాపాడాలని అల్మాస్‌గూడకు చెందిన సూర కర్ణారెడ్డి హైడ్రాలో ఫిర్యాదు చేశారు. బాలాపూర్ గ్రామంలో ఉన్న పెద్ద చెరువు, ఈసానాస్ కుంటను కబ్జాదారుల చెర నుంచి విడిపించాలని బాలాపూర్‌కు చెందిన నాయకులు తిమ్మని గిరీష్, గడ్డం వెంకటేష్, బొర్ర రవిలు హైడ్రాలో ఫిర్యాదు చేశారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో, బఫర్ జోన్ పరిధిలో అడ్డగోలుగా నిర్మాణాలు చేస్తున్నట్లు వారు ఫిర్యాదులో వివరించారు. హైడ్రాపై నమ్మకంతో ఫిర్యాదులు చేసినట్లు వారు తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికి హక్కుల రికార్డుల చట్టం

అధికారులు, రైతుల నుంచి అభిప్రాయ సేకరణలో జిల్లా కలెక్టర్ గౌతమ్

మేడ్చల్, ఆగస్టు 24: అన్ని భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తెలంగాణ హక్కుల రికార్డుల చట్టం 2024కు రూపకల్పన చేసిందని జిల్లా కలెక్టర్ గౌతమ్ పొట్రు అన్నారు. ఈ చట్టంపై రిటైర్డు రెవెన్యూ అధికారులు, రైతులు, ప్రజాప్రతినిధులు, న్యాయ విద్యాలయ అధ్యాపకుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన సమావేశంలో తెలంగాణ హక్కుల రికార్డుల చట్టం 2024 ముసాయిదాపై చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1971లో ఆర్‌వోఆర్ చట్టం వచ్చిందని, 1989 నుంచి ఈ చట్టం ప్రకారం పట్టాదారు పాసు పుస్తకాల ద్వారా భూ పంపిణీ జరిగిందన్నారు. 2020 వరకు కూడా ఇదే చట్టం అమల్లో ఉందని తెలిపారు. కోర్టుల్లో సైతం ఈ చట్ట ప్రకారం కేసుల పరిష్కారం జరిగిందన్నారు. అక్టోబరు 2020 నుంచి ధరణి పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో రికార్డులను క్రమబద్ధీకరించారన్నారు. ధరణిలో రిజిస్ట్రేషన్ అయిన వెంటనే జాప్యం లేకుండా పాసు పుస్తకం అందించే వారని, కాని కొన్ని సమస్యలు తలెత్తాయన్నారు. తెలంగాణ హక్కుల రికార్డుల చట్టం రూపకల్పనకు రాష్ట్రం అంతటా ప్రభుత్వం అభిప్రాయ సేకరణకు ఆదేశించిందన్నారు. అందులో భాగంగా రిటైర్డ్ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతుల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టామని తెలిపారు. సలహాలు, సూచనలను రాత పూర్వకంగా అందించాలని కలెక్టర్ కోరారు. సేకరించిన అభిప్రాయాలను క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు.

పాల్గొన్న కలెక్టర్ గౌతమ్ పోట్రు, అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి, తదితరులు

వర్గీకరణ అంతం.. దళితుల పంతం

డీబీపీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్

అభివాదం చేస్తున్న వడ్లమూరి కృష్ణ స్వరూప్, తదితరులు

రవీంద్రభారతి, ఆగస్టు 24: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన మీడియా సమావేశంలో పలువురు వక్తలు ప్రకటించారు. ఈ సందర్భంగా సమితి జాతీయ చైర్మన్, దళిత బహుజన పార్టీ డీబీపీ జాతీయ అధ్యక్షుడు సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ మాట్లాడుతూ వర్గీకరణ అంతం.. దళితుల పంతం అనే నినాదంతో పాలకుల పైన పోరాటం చేస్తామన్నారు. వర్గీకరణపైన సుప్రీం కోర్టు తీర్పును ఉపసంహరించుకోవాలని కోరారు. బీజేపీ కేంద్ర ప్రభుత్వం, రేవంత్‌రెడ్డి చేస్తున్న వర్గీకరణ ప్రయత్నం ఆర్డినెన్స్ ప్రయత్నం మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. సెప్టెంబర్ 2న తహసీల్దార్ కార్యాలయాల ముట్టడి, 11న అధికార ప్రతిపక్ష పార్టీల ప్రజాప్రతినిధుల ఇళ్ళ దగ్గర నిరసన, 16న జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల వద్ద నిరసన, 27న చలో హైదరాబాద్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం వద్ద ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని ఆయన సమావేశంలో వెల్లడించారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డితో కలిసి సెక్రటరీకి వినతి పత్రం సమర్పిస్తున్న పీఆర్‌జీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమిరెడ్డి దిలీప్ కుమార్ రెడ్డి, పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్ రెడ్డిలు

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సెక్రటరీకి వినతి

అబిడ్స్, ఆగస్టు 24: టెమ్రిస్ ఉద్యోగులకు పదోన్నతికి అవసరమైన డిపార్ట్‌మెంటల్ పరీక్షలు తదితర అంశాలను సర్క్యులర్ రూపంలో తెలియజేసి సమస్యల పరిష్కారానికి పాటు పడాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి, పీఆర్‌జీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమిరెడ్డి దిలీప్ కుమార్ రెడ్డి, పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్ రెడ్డిలు పేర్కొన్నారు. ఈ విషయమై నాంపల్లిలోని టెమ్రిస్ కార్యాలయంలో సెక్రటరీని కలిసి వారు వినతి పత్రం సమర్పించారు. అనంతరం, వారు మాట్లాడుతూ సాధారణ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో అనేక సమస్యలు తలెత్తాయని చాలా సమస్యలను సానుకూలంగా పరిష్కరించినప్పటికీ కొన్ని వాస్తవమైన ఆందోళనలు ఉన్నాయన్నారు.

సీతారామ్‌కు దేవులపల్లి సాహిత్య పురస్కారం ప్రదానం

ప్రముఖ కవి డాక్టర్ ఆర్.సీతారామ్

తెలుగు యూనివర్సిటీ, ఆగస్టు 24: తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణకు సారస్వత పరిషత్తు 80 ఏండ్లుగా చేస్తున్న సేవలు అభినందనీయమని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ అన్నారు. తెలుగు సాహిత్య ప్రక్రియలలో కవితలు, కవితా సంపుటాలు, విమర్శ వ్యాస సంపుటాలు, పరిశోధన గ్రంథాలు వెలువరించి సాహిత్యానికి సీతారామ్ చేస్తున్న సేవలను వక్తలు శ్లాఘించారు. తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో డాక్టర్ దేవులపల్లి రామానుజ రావు 107వ జయంతిని పురస్కరించుకొని శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా ప్రదానం చేసే డాక్టర్ దేవులపల్లి రామానుజ రావు సాహిత్య పురస్కారాన్ని ఈ ఏడాదికి గాను ప్రముఖ కవి, విమర్శకుడు డాక్టర్ ఆర్.సీతారామ్‌కు సీతారామ్‌కు ప్రదానం చేశారు. పురస్కారం కింద రూ.25 వేల నగదు, ప్రశంసాపత్రం, జ్ఞాపిక, శాలువాతో సీతారామ్‌ను సత్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ ప్రసంగిస్తూ సమాజంలోని సమస్యల పరిష్కారానికి సాహిత్యం కృషి చేసేలా రచయితల బాధ్యత అని గుర్తు చేశారు. పరిషత్తు అభ్యుదయంలో అనేకుల కృషి దాగి ఉందని వారిని స్మరించారు. సారస్వత పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య, కోశాధికారి మంత్రి రామారావు పాల్గొని సీతారామ్ సాహిత్య కృషిని కొనియాడారు.

ఇస్కాన్‌లో 26న ఘనంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి

- హెచ్‌టీఎంసీ కన్వీనర్ వరద కృష్ణదాస్, కార్యదర్శి, జనరల్ మేనేజర్ శంభు వైష్ణవ దాస్‌లు
- నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్, జీహెచ్ఎంసీ మల్టీ లెవెల్‌లలో పార్కింగ్ సౌకర్యం
- భక్తులకు ఇబ్బందులు కలుగకుండా పటిష్ట చర్యలు

సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌టీఎంసీ కన్వీనర్ వరద కృష్ణదాస్, కార్యదర్శి, జనరల్ మేనేజర్ శంభు వైష్ణవ దాస్‌లు

సుల్తాన్‌బజార్, ఆగస్టు 24: ప్రతి యేడాది తరహాలోనే ఈ యేడాది కూడా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను అబిడ్స్ ఇస్కాన్ టెంపుల్‌లో అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తున్నట్లు హెచ్‌టీఎంసీ కన్వీనర్ వరద కృష్ణ దాస్, కార్యదర్శి, జనరల్ మేనేజర్ శంభు వైష్ణవ దాస్‌లు పేర్కొన్నారు. ఈ మేరకు అబిడ్స్‌లోని శ్రీశ్రీ రాధామదన మోహన టెంపుల్ ఇస్కాన్ ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ, శ్రీ కృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని ఇస్కాన్ టెంపుల్‌కు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసే సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పటిష్ట చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గత యేడాది వేడుకల సందర్భంగా జరిగిన లోపాలను దృష్టిలో ఉంచుకొని ఈ యేడాది భక్తుల ప్రవేశాన్ని నార్త్ ప్రధాన ద్వారం నుంచి ఏర్పాటు చేసినట్టు తెలిపారు. భక్తులు మందిరంలో దర్శనం అనంతరం వెనుక నుంచి ఎగ్జిట్ దారిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇదిలా ఉండగా, భక్తులు అధిక సంఖ్యలో విచ్చేస్తున్న సందర్భంగా ప్రభుత్వానికి, పోలీస్ శాఖకు విన్నవించిన సందర్భంగా ఈ యేడాది జీపీవో నుంచి ఆలయం ఎదురుగా ఉన్న రోడ్డును పూర్తిగా మూసివేస్తున్నందుకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాంశ్ యాదవ్, అబిడ్స్ ఇన్‌స్పెక్టర్ రాజ గోపాల్ రెడ్డి, ఇతర అధికారులతో కలిసి వారు ఆలయ పరిసరాలను పరిశీలించారు. అనంతరం వారు పోలీస్ అధికారులతో కోఆర్డినేషన్ సమావేశాన్ని నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా తీసుకుంటున్న చర్యలపై వారు అధికారులకు వివరించారు. ఆలయ దర్శనం కోసం విచ్చేసే భక్తుల వాహనాల పార్కింగ్ నిమిత్తం జీహెచ్ఎంసీ మల్టీ లెవెల్, నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లలో పార్కింగ్ చేసేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ యేడాది వేడుకలకు రెండు లక్షలకు పైగా భక్తులు విచ్చేసే అవకాశం ఉందన్నారు. భక్తుల సౌకర్యార్థం సైన్ బోర్డుల ఏర్పాటుతో పాటు సుమారు 400 మంది వాలంటీర్లు సేవలందిస్తారని అన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తాం

మంత్రి పొన్నం ప్రభాకర్

చిక్కడపల్లి, ఆగస్టు 24: ఆర్టీసీ ఉద్యోగుల కష్టాన్ని ప్రభుత్వం గుర్తిస్తోందని, తర్వలోనే పెండింగ్ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పెండింగ్‌లో రూ.200కోట్ల ఆర్పీఎస్ బాండ్ డబ్బులను సిబ్బందికి అందజేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. బాగ్ లింగంపల్లిలోని ఆర్టీసీ కళాభవన్‌లో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉత్తమ ఉద్యోగులకు ప్రగతి చక్ర అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్ సంస్థ ఎండీ వీసీ సజ్జనార్‌తో కలిసి అవార్డు గ్రహీతలకు ట్రోఫీలు, ప్రశంసా పత్రాలు, మెడల్స్, బ్యాడ్జీలు, నగదు రివార్డులతో వారు సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సిబ్బంది పని తీరును గుర్తించి అవార్డులతో సత్కరించడం మంచి సంప్రదాయమని పేర్కొన్నారు. మహాలక్ష్మితో పెరిగిన రద్దీకి అనుగుణంగా కొత్త బస్సులను సంస్థ కోనుగోలు చేస్తుందన్నారు. ఆర్టీసీకి ప్రయాణికులే దేవుళ్లని వారి పట్ల మర్యాదగా ప్రవర్తిస్తూ క్షేమంగా గమ్యస్థానాలను చేర్చాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ మాట్లాడుతూ సంస్థ అభివృద్ధికి అధికారులు, సిబ్బంది నిబద్ధత, అంకితభావంతో పనిచేస్తున్నారని అన్నారు. పనికి తగ్గ గుర్తింపు ఉంటేనే ఏ ఉద్యోగులై